గుంటూరు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు

# ప్రతి డివిజన్‌లో చెత్త సేకరణ జరగాలి

**నగర కమిషనర్ కే మయూర్ అశోక్**

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 28, (ప్రభాతవార్త) : నగరంలోని అన్ని డివిజన్ల నుంచి పిన్ పాయింట్ ప్రకారం చెత్త సేకరణ జరిగితే గుంటూరు నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందని నగర కమిషనర్ కే మయూర్ అశోక్ అన్నారు. ప్రతి డివిజన్లో ఇంటింటి నుంచి తడి పొడి చెత్త సేకరణ జరగాలని, అలానే ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. వ్యర్థాలను నిర్లక్ష్యంగా రోడ్లపై, డ్రైన్లలో వేసేవారిని గుర్తించి భారీ స్థాయిలో అపరాధ రుసుము వసూలు చేయాలని ప్రజారోగ్య విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తన చాంబర్లో కార్పొరేషన్ లోని అన్ని విభాగాల అధికారులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించి నగరంలో పారిశుధ్యం పై ప్రజారోగ్య విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మైక్రో పాకెట్స్ వారిగా ఇంటింటి చర్చ సేకరణ జరగాలని, తడి పొడిగా విభజించి చెత్త అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గత ఏడాది గుంటూరు నగరానికి దక్కిన స్వచ్ఛ లీగ్ క్యాటగిరి నిలబెట్టుకోవాలని, అందరూ భాగస్వామ్యం,కృషితో స్వచ్ఛ సర్వేక్షన్ లో గుంటూరు నగరాన్ని అగ్రగామిగా నిలబెట్టాలన్నారు. కార్మికుల హాజరులు మెరుగుదల ఉండాలని, ఉదయం కంటే మధ్యాహ్నం తక్కువగా ఉంటున్నట్టు తాను గమనించడం జరిగిందని, సీఎంఓహెచ్ కార్మికుల హాజరుపై ప్రత్యేక దృష్టిచారించాలన్నారు. గ్యాంగ్



వర్క్ పై ప్రతి డివిజన్లో శానిటరీ ఇన్స్పెక్టర్లు ప్రత్యేక దృష్టితో పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఫుట్ కార్ట్లను ఇంజనీరింగ్ అధికారుల సమన్వయంతో ప్రజారోగ్య విభాగం శానిటరీ సూపర్వైజర్లు మరమ్మత్తులు చేయించుకుని వినియోగంలోకి తీసుకొని రావాలని ఆదేశించారు. చెట్ల కొమ్మల సమస్యల పరిష్కారానికి ట్రీ బ్రాంచే షడ్డర్ కొనుగోలుకు టెండర్లు పిలవాలని ఎస్ ఈ ని ఆదేశించారు. ఇప్పటివరకు నగరంలో ఉన్న 26 క్లస్టర్ కంపోస్టు యూనిట్లతోపాటు నగరంలోని అన్ని డివిజన్లో కంపోస్ట్ యూనిట్లను ఏర్పాటు చేయాలని శానిటేషన్ అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు మేజర్ డ్రైన్ లలో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగింపుకు గర్ల్స్ ఏర్పాటు చేసే పాయింట్లు గుర్తించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్ష సమావేశంలో సీఎం ఓహెచ్ డాక్టర్ శాంతి కళ, ఎస్ ఈ వెంకటేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎం హెచ్ ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, ఈ ఈ విష్ణు, శానిటరీ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# గుంటూరు వార్త

# సిజేఐ పర్యటనకు పకడ్బంది ఏర్పాట్లు..!

గుంటూరు ఫిబ్రవరి 28, ప్రభాతవార్త ప్రతినిధి : రాష్ట్ర రాజధాని అమరావతిలో ఆదివారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ , రాష్ట్ర ముఖ్యమంత్రి



నారా చంద్రబాబు నాయుడు వివిధ శంకుస్థాపన, ప్రారంబోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లును ఎ.పి. జ్యుడీషియల్ అకాడమీ గవర్నర్ల బోర్డు సభ్యులు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి ఎ. హరిహరనాధ శర్మ, రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి శామ్యూలరావు, రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం పరిశీలించారు. తుళ్లూరు మండలం పిచ్చుకలంకాయ పాలెం వద్ద ఎన్ 16 రోడ్డు సమీపంలో ఎ.పి జ్యుడీషియల్ అకాడమీ భవనం, హైకోర్టు సమీపంలో ఎపి హైకోర్టు గెస్ట్ హౌస్ శంకుస్థాపన ఏర్పాట్లు, హైకోర్టు జడ్జీల రెసిడెన్షియల్ ఎన్ క్లేవ్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీనివాసులు, ప్రొటోకాల్ డైరెక్టర్ మోహనరావు,డీఎస్పీ మురళీకృష్ణ, సీఆర్డీఏ, పోలీస్, రెవెన్యూ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పింఛన్లు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్

గుంటూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త ప్రతినిధి : శనివారం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అంకమ్మ నగర్ లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పెన్షన్ దారుల జీవన విధానం, రేషన్ సరఫరా, ఆరోగ్య పరిస్థితిని, ప్రభుత్వం నుంచి అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసు కున్నారు. పలువురు స్థానికులు ఇంటి స్థలాలు, ఇంటి నిర్మాణానికి రుణాల మంజూరు తదితర అంశాలపై తెలియజేసిన సమస్యలను వెంటనే పరిశీలించి పరిష్కారదిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుభాని, మున్సిపల్, డీఆర్డీఏ అధికారులు పాల్గొన్నారు.



# విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కరించాలి..!

**జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా**

గుంటూరు ఫిబ్రవరి 28 ప్రభాత వార్త ప్రతినిధి : విభిన్న ప్రతిభావంతుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు.



శనివారం గుంటూరు కలెక్టరేట్ లో విభిన్న ప్రతిభావంతుల స్పెషల్ గ్రీవెన్స్ కలెక్టర్ నిర్వహించారు. అర్జీలు అందించడానికి వచ్చిన విభిన్న ప్రతిభవంతుల వద్దకే కలెక్టర్ స్వయంగా వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. కదలలేని స్థితిలో ఆటోలో తీసుకువచ్చిన మంగళగిరికి చెందిన విభిన్న ప్రతిభావంతులు సీంధు సాయి ఆటో వద్దకు వెళ్ళి అర్జీ స్వీకరించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. విభిన్న ప్రతిభావంతులు అందించిన పలు అర్జీలను సత్వరమే పరిష్కారం దిశగా కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. అంకిరెడ్డిపాలెం కి చెందిన డి నాగమల్లి రాజు హియరింగ్ ఎయిడ్ కిట్ కోసం అర్జీ అందించగా విభిన్న ప్రతిభావంతులు కార్యాలయం నుంచి హియరింగ్ ఎయిడ్ కిట్ ను తీసుకువచ్చి వెంటనే అందించారు. అదేవిధంగా పలువురు ఉపాధి కోసం, ఇంటి స్థలాలు కోసం, వికలాంగుల పూర్తి స్థాయి పింఛను కోసం అందించిన అర్జీలను సంబంధిత అధికారులకు అందించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతుల స్పెషల్ గ్రీవెన్స్ లో వివిధ సమస్యల పరిష్కారం కోసం 46 అర్జీలు అందించారు.

# అర్హులందరికీ పింఛన్లు అందేలా కృషి చేస్తాం

**ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

గుంటూరు, ఫిబ్రవరి 28,ప్రభాతవార్త : గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 18వ డివిజన్ 60వ సచివాలయంలో పరిధిలోని అడపా బజార్ నందు ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా నారా



చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి పెన్షన్ మొత్తాన్ని రూ.4,000కి పెంచడం ఎంతో శుభపరిణామమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే ప్రతి ఇంటికి వెళ్లి పెన్షన్లు అందించడం జరిగిందని, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో దాదాపు 21 వేల మంది పెన్షన్ దారులు ఉన్నారని, ప్రతి నెల సుమారు రూ.99 కోట్లకు పైగా మొత్తాన్ని అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం చెల్లిస్తోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఆపన్నులకు ఆపన్నహస్తంగా నిలిచే సంక్షేమ పథకాలలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ముఖ్యమైనదని, అయితే 60వ సచివాలయం పరిధిలో కొంతమంది అర్హులైన వారు ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ పెన్షన్ అందుకోలేకపోతున్న సమస్యను స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ లబ్ధి పొందలేక పోతున్న వారందరి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో ప్రతి అర్హుడికి పెన్షన్ అందేలా చర్యలు తీసుకునే దిశగా కృషి చేస్తామని, కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి అనే రెండు కళ్లతో ముందుకు సాగుతోందని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గుంటూరు పశ్చిమ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో నాయకులు సమన్వయంతో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి కనకాచారి, ఉల్లి గోపాల్, ఉప్పుతల సాంబ, కార్పొరేటర్ నిమ్మల రమణ,కొల్లి అనిల్, గుర్రం ప్రసాద్, ముప్పా వేణు బాబు పాల్గొన్నారు.

# అల్లా ఇచ్చిన పవిత్ర మాసం రంజాన్..!

**కేంద్రమంత్రి పెమ్మసాని**

గుంటూరు ఫిబ్రవరి 28, ప్రభాతవార్త ప్రతినిధి : గుంటూరు జిల్లాలోని నంబూరు గ్రామంలో ముస్లిం మైనారిటీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్.. నిర్మాణ దాతలు సూద్నగుంట రాఘవేంద్ర ప్రసాద్,



కళ్యాణి ప్రసాద్ లతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డా. పెమ్మసాని మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులకు ఉపయోగపడేలా కమ్యూనిటీ హాల్ నిర్మించడం అదృష్టంగా భావిస్తున్నాని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుతో స్పందించిన వైద్యులు సూద్నగుంట రాఘవేంద్ర ప్రసాద్ షాదీఖానా నిర్మాణానికి ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. దీనితో పాటు మరో 9 కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి రూ. 4 కోట్ల విరాళాన్ని అందించిన రాఘవేంద్ర ప్రసాద్ కు ధన్యవాదాలు తెలిపారు.

**ముస్లిం సోదరులను ఉద్దేశించి డా. పెమ్మసాని మాట్లాడుతూ...**

అల్లా ఇచ్చిన అవకాశం ఈ పవిత్ర రంజాన్ మాసమని డా. పెమ్మసాని అన్నారు. ఆకలి బాధ తెలిస్తే ఎదుటివాడి కష్టం తెలుస్తుందని అన్నారు. దయ, దానం జకాత్ ద్వారా ప్రజలకు సహాయ పడటం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. అందరూ సుఖశాంతులతో, కలిసి మెలిసి ఆనందంగా జరుపుకునే పండుగ రంజాన్ అని పేర్కొన్నారు.

**కమ్యూనిటి హాల్ దాత రాఘవేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ..**

ఉన్నది దాచుకుంటే ఉపయోగం లేకుండా పోతుందని, ఉన్నది పంచుకుంటే అందరికీ ఉపయోగపడుతుందని రాఘవేంద్ర ప్రసాద్



కమ్యూనిటి హాల్ శంకుస్థాపన సందర్భంగా స్పష్టం చేశారు. శక్తి లేని తరుణంలో మాలాంటి వాళ్ల నుంచి సహాయం తీసుకుని అభివృద్ధిలోకి వచ్చిన యువత.. వారు వృద్ధాప్యంలోకి వెళ్ళినప్పుడు తిరిగి మరికొంత మంది యువతకు సహాయం అందించాలని కోరుకుంటున్నాని అన్నారు.

**ఇఫ్తార్ విందులో డా. పెమ్మసాని, ఎమ్మెల్యే నశీర్ అహ్మద్ ..** కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన అనంతరం ముస్లిం సోదరులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని , గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నశీర్ అహ్మద్ పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి పవిత్ర ప్రార్థనలు చేశారు. కఠిన ఉపవాసాలు చేస్తూ ఆకలి, కష్టం విలువ ప్రతి ఒక్కరికి తెలియజేయడమే రంజాన్ పండుగ ప్రత్యేకత అని ఈ సందర్భంగా డా. పెమ్మసాని తెలియజేశారు.

# ఐవిఆర్ఎస్ సర్వేలో నెగిటివ్ ఫీడ్ బ్యాక్ రాకూడదు

**-జేసీ అశుతోష్ శ్రీవాత్సవ**

గుంటూరు ఫిబ్రవరి 28, ప్రభాతవార్త ప్రతినిధి : ప్రభుత్వం నిర్వహించే ఐ వి ఆర్ ఎస్ సర్వేలో గుంటూరు జిల్లా నెగిటివ్ ఫీడ్ బ్యాక్ లో ఉన్నందున ఎల్ పిజి డిస్ట్రిబ్యూటర్లు, చౌక ధరల దుకాణాదారులతో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాత్సవ, డిఎస్ఓ కోమలి పద్మ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ



ప్రతినెల ఐ వి ఆర్ ఎస్ సర్వేను సీఎం చంద్రబాబు నిశితంగా పరిశీలిస్తున్నారని అన్నారు. గత ఏడు నెలలుగా ఈ సర్వేలో గుంటూరు జిల్లా గ్యాస్ ఏజెన్సీల్లో 30 శాతం కంటే ఎక్కువగా నెగిటివ్ రెస్పాన్స్ వస్తుందని అన్నారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ వినియోగదారుల నుండి అధికంగా చార్జీలు వసూలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఐ వి ఆర్ ఎస్ సర్వేలో పాజిటివ్ రెస్పాన్స్ వచ్చేలాగా పనితీరును మెరుగుపరచుకోవాలని సూచించారు. చౌక ధరల దుకాణాల్లోని కొంతమంది డీలర్ల పై ప్రజల నుండి నెగిటివ్ రెస్పాన్స్ రావడం వల్ల జిల్లాకు చెడ్డ పేరు వస్తుందని తెలిపారు. వృద్ధులకు డోర్ డెలివరీ చేయకపోవడం, సమయపాలన పాటించక పోవడం వంటి కారణాల వల్ల డీలర్ల పై వ్యతిరేకత వస్తుందన్నారు. ప్రతి డీలరు కార్డుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని అన్నారు. షాపులు సమయ పాలన పాటించాలని, వృద్ధులకు,దివ్యాంగులకు, మంచంలో ఉన్న వ్యాధిగ్రస్తులకు ప్రతినెల 26 నుండి 31వ తేదీ వరకు వారి ఇంటి వద్దనే సరుకులు ఖచ్చితంగా పంపిణీ చేయాలన్నారు.

## నీరు లేకపోయినా..

# నీటి పన్ను డిమాండ్ నోటీసులు..!

- దిగువకు అందని నీటి చుక్క.
-నీరు లేకపోయినా నీటి పన్ను డిమాండ్‌లు రైతులకు అందజేత..
-నీటి తీరువా డిమాండ్‌లు చూసి విస్తుపోతున్న రైతులు .

యడ్లపాడు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త : అతి వృష్టి అనా వృష్టి వాతావరణ మార్పుల వల్ల పడుతున్న అధిక వర్షాలకు రైతులు విల విల లాడుతున్నారు. సకాలంలో నీటి చుక్క అందక పంటలకు నీటిని అందించ లేక నానా తంటాలు పడుతున్నారు. వీటన్ని కారణంగా పంటలు సరిఅయిన సమయంలో సరిఅయిన దిగుబడులు లేక నానా ఇబ్బందులకు గురై అప్పులు పాలు కాకతప్పని పరిస్థితులు నేడు ఉన్నాయి. ఇటు ప్రభుత్వాలు రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రైతులకు కావల్సిన కనీస సౌకర్యాలను అందించ లేకపోవటంతో రైతులు, కౌలు రైతులు సతమతమవుతున్నారు. దీనంతటిని కాదనలేక రైతులు నీటి తీరువా కట్టాలంటూ రెవెన్యూ అధికారులు గ్రామాలలో ఇప్పటికే డిమాండ్ నోటీసులు రైతులకు అందజేసారు. మండలంలో ఉన్నటు వంటి మేజర్




కాల్వలు ప్రధాన మైనది నందిపాడు మేజర్ ఇది దిగువ వరకు నీటిని అందించాల్సిన అవసరం ఉంది కాబట్టి కాల్వలు వదిలిన వెంటనే నీరు ప్రవహించుతుంది. మిగిలిన మేజర్లు కొండవీటి మేజర్ పరిధిలోని కొత్తపాలెం, కొండవీడు, కోట, సొలస, చెంఘీస్కాన్‌పుట, ఉప్పరపాలెం, వంకాయలపాడు, కారుచోల, జాగ్గాపురం గ్రామాల వరకు విస్తరించి ఉంది. మూడవది తుర్లపాడు మేజర్ ఇది దింతెనపాడు, తుర్లపాడు, గణేషునివారిపాలెం, సందెపూడి గ్రామాల వరకు, నాల్గవది వంకాలపాడు మేజర్ ఇది ఉన్నవ, వంకాయలపాడు, మర్రిపాలెం గ్రామాల వరకు ఉన్న పంట పొలాలకు నీటిని అందించ వల్సి ఉంది. అయితే నేడు దిగువకు నీటిని ఈ మేజర్లు ఎప్పుడూ అందించిన పాపాన పోలేదు. ఏటా ఏదో ఒక నిధులు వెచ్చించి మాత్రం అధునీకరణ పేరుతో మరమ్మత్తులు చేపట్టటమే గాని నీటిని దిగువ వరకు ఇచ్చిన పాపాన పోలేదని రైతులు తెలుపుతున్నారు. ఇది ఇలా ఉంటే మరి ఈ మేజర్ల క్రింద ఉన్న అయకట్టు భూములకు నీటి పన్ను చెల్లించాలని రైతులకు డిమాండ్ నోటీసులు ఇవ్వటమేంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు నీరు అందించకుండా నీటి తీరువా డిమాండ్‌లు ఇవ్వటం సరిగాలేదని, రైతుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని రాని నీటికి నీటి పన్ను కట్టాలనే విధానాన్ని వెనక్కు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు ఏవిధంగా స్పందించుతారో వేచి చూడవల్సి ఉంది. ..గ్రామాల వారీగా నీటి పన్ను డిమాండ్ ఈ విధంగా ఉన్నాయి : కొండవీడు గ్రామంలో 776ఖాతా నెంబర్లకు సంబంధించి సుమారు 1358ఎకరాలు, సొలస 1276కుగాను 4759ఎకరాలు, మైదవోలు 336గాను 1389, వంకాయలపాడు 358గాను 893ఎకరాలు, మర్రిపాలెం 4గాను 9ఎకరాలు, ఉన్నవ 867గాను 1492, విశ్వనాధకండ్రిక 40గాను 57ఎకరాలు, యడ్లపాడు 81గాను 215ఎకరాలు, తిమ్మాపురం 470గాను 1373ఎకరాలు, జాలాది 204గాను 534ఎకరాలు, కారుచోల 406గాను 997ఎకరాలు, తుర్లపాడు 365గాను 998ఎకరాలు, సందెపూడి 361గాను 717ఎకరాలకు నీటి పన్నుల డిమాండ్ నోటీసుల అందిస్తున్నారు. దీనంతటికి చెల్లించవల్సి నగదు సుమారు 16లక్షల వరకు ఉంటుంది. ఇది వరుసగా మూడు సంవత్సరాలకు కలుపుకొని రైతులు చెల్లించవల్సి ఉంటుంది.

# 50 లక్షల విలువైన 247 ఫోన్లు రికవరీ,అందజేత





గుంటూరు క్రైమ్, ఫిబ్రవరి28,ప్రభాతవార్త: పోగొట్టుకున్న, దొంగిలించిన సెల్ ఫోన్లను రికవరీ చేసి ఉచితంగా అందజేసి బాధితులకు పోలీసులు అండగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 8కోట్ల 14 లక్షల విలువైన 4,074 మొబైల్ ఫోన్ల రికవరీ చేసి బాధితులకు అందజేశారు. సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే అవి దుర్వినియోగం కాకుండా దిని.లి వెబ్ సైట్ కి జాతీయ సైబర్ క్రైమ్ కి సహాయత నంబర్ 1930 కి ఫిర్యాదు చేయాలని ఎస్పీ ప్రజలకు సూచనలు చేశారు. ఆర్థిక లావాదేవీలు ఎక్కువగా సెల్ ఫోన్ నుండి చేస్తున్న ఈ రోజుల్లో సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ఏవైనా అనుమానిత/ బెదిరింపు కాల్స్ వస్తే 1930 కి గాని, డయల్ 112 కి గాని, దగ్గరలోని పోలీస్ వారి దృష్టికి గానీ తీసుకురావాలన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ నందు రికవరీ చేసిన సుమారు 50 లక్షల విలువైన 247 దొంగిలింపబడిన,పోగొట్టుకున్న సెల్ ఫోన్లను బాధితులకు గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..చాలా సందర్భాల్లో ప్రజలు తమ సెల్ ఫోన్లను పోగొట్టుకోవడం లేదా దొంగలింపబడటం వలన చాలా ఇబ్బందులను ఎదుర్కొంటుటారు. వాటిలో వ్యక్తిగత, బ్యాంకు, ఇతర గోప్యమైన వివరాలు ఉండవచ్చు. నేరస్తులు వాటిని దుర్వినియోగ పరచవచ్చు. ఈ క్రమంలో బాధితులు పోలీసు వారికి ఫిర్యాదులు చేస్తున్నారు. బాధితుల ఫిర్యాదుల ఆధారంగా పోలీసు వారు పోయిన సెల్ ఫోన్ల యొక్క వివరాలను బట్టి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, వాటిని కనుగొని, ఎటువంటి రుసుము చెల్లించకుండానే బాధితులకు ఉచితంగా అందజేస్తున్నారు. బాధితులు ఎంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా ప్రజలు తమ మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన ఎడల వెంటనే CEIR వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నట్లు తెలిపారు.

# వైభవంగా నృసింహుని గజ వాహన సేవ



మంగళగిరి, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త: మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజైన శనివారం రాత్రి స్వామివారు గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అర్చక స్వాములు స్వామివారి ఉత్సవ మూర్తులను వాహనంపై అధిష్టింప చేసి రంగు రంగు పూలమాలలు, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆ విద్యుత్ కాంతుల మధ్య పెండ్లి కుమారుడైన నరసింహుడు దేదీప్యమనంగా వెలుగొందుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. దేవస్థానం ప్రధాన అర్చకులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు, అర్చక బృందం పూజలు నిర్వహించారు. ఉత్సవ విశిష్టతను శ్రీనివాస దీక్షితులు వివరించారు. స్వామి తనని రక్షించాడనే కృతజ్ఞతతో గజరాజు స్వామివారికి వాహనమయ్యాడన్నారు. గజము అష్టమంగళములలో ఒకటన్నారు. గజవాహన రూఢుడైన శ్రీ స్వామిని దర్శించిన వారికి, స్వామి వారు అష్టైశ్వర్యములు అనుగ్రహిస్తారన్నారు. గజవాహన ఉత్సవమును దర్శించిన మొసలి బారి నుండి తన భక్తుడైన గజేంద్రుని రక్షించిన విధముగా, సంసారం అనే మొసలి బారి నుండి తన భక్తులను కాపాడి, రక్షించి, ముక్తిని, మోక్షాన్ని, శుభములను కలుగచేస్తారన్నారు. గ్రామోత్సవం తొలుత దేవస్థానం నాలుగు మాడవీధులలో నిర్వహించి, అనంతరం మెయిన్ బజార్ మీదుగా మిద్దె సెంటర్ కు సాగింది. విచిత్ర వేషధారణలు, బాణాసంచా పేలుళ్లు, మేళతాళాలు, కనక తప్పట్లు, తీన్మార్ ల మధ్య ఉత్సవం నిర్వహించారు. ఆయా సెంటర్లలో భక్తులు పెద్ద సంఖ్యల హాజరై స్వామివార్లను దర్శించుకుని, టెంకాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఉత్సవానికి పాత మంగళగిరి శ్రీ పద్మశాలీయ సంఘం కైంకర్యపరులుగా వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం ఎదుట శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళావేదికపై నిర్వహిస్తున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేవస్థాన సహాయ కమిషనర్ అండ్ కార్యనిర్వాహణాధికారి కోగంటి సునీల్ కుమార్, ధర్మకర్తల మండలి పర్యవేక్షించారు.

# శానిటేషన్, రోడ్లు,మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి : తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 28,ప్రభాతవార్త : గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తి నిర్లక్ష్యానికి గురైన అన్ని ప్రాంతాలను అభివృద్ధి పథంలో తీసుకెళుతున్నామని, ఎక్కడా రాజీ పడబోమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శనివారం స్థానిక గుంటూరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో రూ.5.50 కోట్లతో స్థానిక కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. శ్రీనగర్ లో రూ.10.4 లక్షలతో మంచినీటి పైపు లైను, రూ.24 లక్షలతో సీసీ రోడ్డు, వాసవి నగర్ లో రూ.1.99 కోట్లతో సీసీ డ్రెయిన్, బాలాజీ నగర్ లో రూ.1.90 కోట్లతో సీసీ డ్రెయిన్, అయ్యప్పనగర్ 1వ లైనులో రూ.39 లక్షలతో సీసీ డ్రెయిన్, రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని వైసీపీ నాయకులు పూర్తిగా నాశనం చేశారని మండిపడ్డారు. అభివృద్ధి ఆనవాళ్లు లేకుండా ధ్వంసం చేశారన్నారు. యూజీడీ పనులను పక్కన పడే యడం తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కనీసం పాద చారులు కూడా



తిరిగే పరిస్థితి లేకుండా పోయిందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రతి ప్రాంతాన్ని వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. సీఎం చంద్రబాబు నాయుడు కలెక్టర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో గుంటూరు నగర అభివృద్ధిపై ప్రధానంగా ప్రస్తావించిన విషయాన్ని గుర్తు చేశారు.

# పింఛన్లను పంపిణీ చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, ఫిబ్రవరి 28,ప్రభాతవార్త :** ప్రతి నెలా కుటుంబ అవసరాలకుగానీ, నిత్యం మందులకుగానీ ఎలాంటి ఢోకా లేదు. మా పెద్దకొడుకులా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇంటి వద్దకే పంపుతున్నారయ్యా అని పింఛన్ లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ



మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ తెలిపారు. శనివారం స్థానిక పాత గుంటూరులోని రెడ్ల బజారులో పింఛన్ లబ్ధిదారులకు కూటమి నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే నసీర్ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పింఛన్ లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఒక రోజు ముందుగా పింఛన్ అందించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుభిక్ష పాలన సాగుతోందని, ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ లో సుమారు రూ.33 వేల కోట్లు పింఛన్లకే కేటాయించినట్లు చెప్పారు. ప్రతిపక్షం కూడా లేని వైసీపీ ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటూ అసెంబ్లీ కనీసం సమస్యల గురించి మాట్లాడటం లేదని విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. అమరావతి, పోలవరాన్ని పూర్తి చేసేందుకు అడుగులు వేస్తున్నామన్నారు. కల్తీ లడ్డూతోపాటు అసభ్యకర పోస్టులతో వైసీపీ నాయకులు మరింత దిగజారిపోయారని పేర్కొన్నారు.

# వార్డుల్లో అసంపూర్తిగానే పనులు,కౌన్సిల్ చివరి సమావేశంలో సభ్యుల ఆవేదన

**తెనాలి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 28,(ప్రభాతవార్త):** అధికారులు సహకరించకపోవడంతో,ఐదుసంవత్సరాల్లో వార్డుల్లో పనులు అసంపూర్తిగానే మిగిలాయని పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు.శనివారం తెనాలి మున్సిపల్ కౌన్సిల్





ఫిబ్రవరి నెల అత్యవసర సమావేశం చైర్మన్ తాడిబోయిన రాధిక ఆధ్వర్యంలో తాత్కాలిక నూతన కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా మహాత్మా గాంధీ కూరగాయల మార్కెట్ భవనంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక నూతన మున్సిపల్ కార్యాలయాన్ని చైర్మన్ తాడిబోయిన రాధిక ప్రారంభించారు.పాత మున్సిపల్ భవనం శిధిలావస్థకు చేరటంతో కార్యాలయాన్ని మార్కెట్ కాంప్లెక్స్ లోకి మార్చారు.ఉదయం గం 11.30ని లకు ప్రారంభమైన సమావేశంలో, గత శుక్రవారం పట్టణానికి చెందిన ఆయేషా మీరా అవశేషాలు తిరిగి ఖననం చేసినందున, ఆమె ఆత్మకు శాంతి కలగాలని సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.అనంతరం ఎజండా లోని అంశాలు చర్చిస్తుండగా కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, పసుపులేటి త్రిమూర్తి,మోఘల్ అహ్మద్ మాట్లాడుతూ,మున్సిపల్ అధికారులు,కౌన్సిల్లర్లు అంటే సరైన గౌరవం గుర్తింపు ఇవ్వట్లేదని సరైన సమాచారం అందజేయకుండా చిన్న చూపు చూస్తున్నారు అని ఆరోపించారు. అదేవిధంగా 3వ వార్డు కౌన్సిలర్ ఆవుల కోటయ్య,30వ వార్డు కౌన్సిలర్ జయపాల్ లు మాట్లాడుతూ,తమ పదవీకాలం ఇంకా 18 రోజులు మాత్రమే ఉందని,ఈ లోపలన్న అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి తమ హయాంలో ఆయా పనులు చేపట్టామని చెప్పుకునే విధంగా అధికారులు స్పందించి,అసంపూర్తి పనులను పూర్తి చేయాలని కోరారు. అనంతరం తాడిబోయిన రామయ్య తన వార్డులో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ గురించి ప్రశ్నించారు. కౌన్సిలర్ దుబాయ్ బాబు ప్రశ్నిస్తూ, పట్టణ నడిబొడ్డున గాంధీ చౌక్ ప్రాంతంలో రోడ్డు వర్కుల కోసం చేపట్టిన పనులు పూర్తయిన ఇంకా బారికేడ్లు తొలగించలేదని కోరగా అధికారుల సమాధానంతో అసహనం వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి మాట్లాడుతూ తన వార్డు పరిధిలో, ఈ కౌన్సిల్ ఏర్పడ్డాక గడచిన ఐదు సంవత్సరాల్లో ఏ ఒక్క అభివృద్ధి పనులు కూడా ప్రారంభించలేదని ఎటువంటి మురుగు కాలువల నిర్మాణానికి కూడా నోచుకోలేదని తమ వార్డు అయితా నగర్ ప్రాంతాన్ని ఎందుకు చిన్నచూపు చూస్తున్నారని, ప్రజలకు తాము ఏం సమాధానం చెప్పాలని కన్నీళ్ళ పర్యంతమయ్యారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ, సకాలంలో బిల్లులు మంజూరు కావటం లేదని సమాధానమిచ్చారు. అలాగే 26,27 వార్డుల కౌన్సిలర్లు షేక్ ఇస్మాయిల్,బోయపాటి అరుణ లు తమ వార్డుల్లో కల్వర్టు నిర్మాణాలు సరిగా చేయలేదని ప్రశ్నించగా, మున్సిపల్ ఏఈ సమాధానమిస్తూ,వచ్చే వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తామని హామీఇచ్చారు.సమావేశంమధ్యలో కామాక్షి స్వర్ణ కార సంఘం సభ్యులు, తమ సమస్యలపై చైర్మన్ మరియు మున్సిపల్ కమిషనర్ కి వినతిపత్రం అందజేశారు.మున్సిపల్ కార్యాలయం వెనుక స్వర్ణకారుల దుకాణాల కోసం పురపాలకసంఘం ఆధ్వర్యంలో భవన నిర్మాణం చేపట్టి,ఆపనులను అర్ధాంతరంగా ఆపేశారని, ప్రస్తుతం షరాఫ్ బజార్లో ఇరుకు సందుల్లో చిన్న చిన్న దుకాణాల్లో,పనులు చేసుకుంటూ అనారోగ్య బారిన పడుతున్నామని, కావున అసంపూర్తిగా ఉన్న భవనానికి త్వరగా పనులు చేపట్టి తమకు షాపులు కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం అజెండాలోని 27 అంశాలను సభ్యులు ఆమోదించారు.

# ఇఫ్తార్ విందులోపాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

**తెనాలి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 28,(ప్రభాతవార్త):** తోటి వారిని ప్రేమిస్తూ పేదవారికి సాయం చేయాలని,అల్లా సూక్తిని ప్రతి ఒక్కరూ పాటించాలని,ఈ పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులో పాల్గొనడం చాలా సంతోషకరంగా ఉందని మాజీ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు.శనివారం స్థానిక 28వ వార్డు పినపాడు లో,



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు షేక్ అహ్మదీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమనకు ముఖ్యఅతిథిగా మాజీ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ విచ్చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ యాతాటి అనిల్,షేక్ దుబాయ్ బాబు,షేక్ నూరు ఇస్మాయిల్,పేచ్చింగ్ సుభాని, షేక్ ఖధీర్,షేక్ ఖుద్దుస్ ,షేక్ ఆసిఫ్,అక్కిదాసు కిరణ్ కుమార్, కోగంటి ఆశు తదితరులు పాల్గొన్నారు.

# సంకల్పం“లో భాగంగా తెనాలి పోలీసుల తనిఖీలు

**తెనాలి టౌన్,ఫిబ్రవరి28(ప్రభాతవార్త):** ప్రజల్లో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం “సంకల్పం” కార్యక్రమంలో భాగంగా, తెనాలి పట్టణంలో శనివారం





తెల్లవారుజామున టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీసీ కాలనీలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తెనాలి డిఎస్పి బి జనార్దన్ రావు నేతృత్వంలో పట్టణ వన్ టౌన్ సిఐ మల్లికార్జునరావు,టూ టౌన్ సిఐ రాములు నాయక్ ఆధ్వర్యంలో ఎస్సైలు పోలీసు సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని కాలనీలోని ప్రతి ఇంటిని తనిఖీలు చేశారు.అనంతరం డిఎస్పి జనార్ధనరావు మాట్లాడుతూ,గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, గంజాయి మాదకద్రవ్యాల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని టూటౌన్ పరిధిలో గల బిసి కాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహించి, ఇంటింటికి తనిఖీలు చేసి అనుమానితులను విచారించామని,సరైన పత్రాలు లేని 50 ద్విచక్ర వాహనాలను,4 ఆటోలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం “సంకల్పం“లో భాగంగా కాలనీవాసుల చేత గంజాయి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

# వైన్ షాపులో చోరీ

**తెనాలి టౌన్ ఫిబ్రవరి 28(ప్రభాతవార్త):** రూరల్ మండలగ్రామం అంగలకుదురు లో వైన్ షాప్ లో భారీచోరీ జరిగింది.యజమాని ఉన్నం బాబు కథనం ప్రకారం, రోజు మాదిరిగా శుక్రవారం సాయంత్రం 10గంటలకు షాపు మూసివేసి ఉదయాన్నే వచ్చేసరికి వేసిన తాళం పగులగొట్టి ఉందని,లోపలికి వెళ్లి చూస్తే రాత్రి ఉంచిన రూ.4వేలు నగదు,సిగరేట్స్ ఇంకా కొన్ని మొత్తం రూ.15వేలు విలువచేసే సరుకు మాయమైందని, ఇటీవల కాలంలో ఇది రెండవ చోరీ అని తెలిపారు. దీనిపై రూరల్ పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశామని తెలిపారు.



# క్రమం తప్పకుండా ఫించన్లు అందజేస్తున్న ఘనత తెదేపాదే

### -తెదేపా నాయకుడు బొప్పన బాపనయ్య

**కసుకర్రు(పొన్నూరు), ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:** క్రమం తప్పకుండా అన్ని రకాల సామాజిక ఫించన్లను అందజేస్తున్న ఘనత టిడిపి ప్రభుత్వానికే



దక్కుతుందని టిడిపి నాయకుడు బొప్పన బాపనయ్య అన్నారు. మండల పరిధిలోని కసుకర్రు గ్రామంలో శనివారం ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సచివాలయ సిబ్బంది ఫించన్లను ఏ విధంగా అందజేస్తున్నారన్న విషయాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వృద్ధాప్య పించన్లను రూ.4వేలు అందజేస్తున్న ఏకైక రాష్ట్రం ఏపి మాత్రమేనన్నారు. ప్రజలు కూడా మంచి ప్రభుత్వానికి ఆశీస్సులు అందించాలని కోరారు. కార్యక్రమంలో విఆర్వో శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్తమ ర్యాంకు సాధించేందుకు సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలి

### -మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు

పొన్నూరు, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పొన్నూరు పురపాలక సంఘం ఉత్తమ ర్యాంకు సాధించేందుకు అధికారులు, సిబ్బంది, కార్మికులు చిత్తశుద్ధితో పనిచేయాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ



రమేష్‌బాబు కోరారు. స్థానిక మునిసిపల్ కార్యాయలంలో శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్ నిమిత్తం ప్రతి వార్డుకు ఒక నోడల్ ఆఫీర్‌ను నియమించారు. వారికి ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి వార్డును పరిశుభ్రంగా ఉంచేందుకు నోడల్ అధికారి, ఆయా సచివాలయాల సిబ్బందిని, కార్మికులను కార్యోన్ముఖులను చేయాలన్నారు. స్వచ్ఛసర్వేక్షణ్ బృందం ఈ నెలలో తనిఖీకి వస్తారని, ఈ నెల రోజుల పాటు పొన్నూరు పట్టణంలోని ప్రతి వార్డు పచ్చదనంగా ఉండేవిధంగా చూడాలన్నారు. రోడ్లపై చెత్తాచెదారాలు లేకుండా ఎప్పటికప్పుడు క్లీన్ చేయించాన్నారు. అదేవిధంగా కాలువలు కూడా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. మురుగునీరు ఎక్కడా నిలువలేకుండా చూడాలన్నారు. నోడల్ అధికారులు కిందిస్థాయి సిబ్బందిని ఎప్పటికప్పుడు చైతన్యపరుస్తూ ముందుకు సాగాలని కమిషనర్ ఆదేశించారు.

# లెప్రసీపట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలి : డాక్టర్ సోమ్లా నాయక్

**చెరుకుపల్లి ,ఫిబ్రవరి 28 ,ప్రభాతవార్త :** లెప్రసీ పట్ల ప్రజలు అవగాహన కలిగి తగిన సమయంలో చిన్నపాటి వైద్య సలహాలు పాటించడం ద్వారా అరికట్టవచ్చునని డి ఎల్ ఎ టి ఓ సోమ్లా నాయక్ అన్నారు. కావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. టీనేజ్ వయసులో బాల్య వివాహాలు వలన తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని కావున బాల్య వివాహాలను ఎట్టి పరిస్థితుల్లో చేసుకోరాదని డి పి హెచ్ ఎన్‌ఓ సుగుణ అన్నారు. ఈ సందర్భంగా ఎన్సిడిసిడి, ఏ ఎన్ సి విజిట్లు, తదితర పథకాల



తీరు గురించి వైద్య సిబ్బందితో సమీక్ష చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు జుబేదా, సమద్, సి హెచ్ ఓ వాణి, హెచ్ వి రాజకుమారి, హెచ్ ఎస్ శ్రీనివాసరావు, హెచ్ ఈ అరణ ,ఏఎన్ఎంలు ,ఆశాలు, ఎం ఎల్ హెచ్ పి లు పాల్గొన్నారు.

# చెరుకుపల్లి లో ఘనంగా టైలర్స్ డే

**చెరుకుపల్లి ,ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** శనివారం టైలర్స్ డే సందర్భంగా చెరుకుపల్లి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 100 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కుట్టు



మిషన్ సృష్టికర్త విలియమ్స్ ఒవే చిత్రపటానికి పూలమాలలు వేసి అసోసియేషన్ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయంలో తమ సమస్యల పరిష్కారానికి సంబంధించి మెమొరండాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ కె శ్రీనివాసరావు, చంద్రమోళి, కే నాగేశ్వరావు, జి శ్రీనివాసరావు, ఎస్ కే బాజీ, దుర్గాప్రసాద్ ,ఈశ్వరరావు, పలువురు టైలర్స్ సభ్యులు పాల్గొన్నారు.

# బస్ షెల్టర్‌కు రంగులువేసిన కెఎల్‌యు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

**తాడేపల్లి,ఫిబ్రవరి 28,ప్రభాతవార్త :** కెఎల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్,సీఎస్ఈ-3 విభాగం ప్రత్యేక శిబిరాల్లో భాగంగా ప్రజలకు ఉపయోగపడే విధంగా రేవేంద్రపాడులో పాడైపోయిన బస్‌షెల్టర్‌లోని పోస్టర్లు,ప్రకటనలు తొలగించి బూజు తదితరాలను ఊడ్చి,నీటితో శుభ్రపరిచి ఆకర్షణీయంగా రంగులు వేసి అందంగా తీర్చిదిద్దినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.ప్రజలు బస్సుల కోసం వేచివుండే ప్రదేశం



పరిశుభ్రంగా,సౌకర్యవంతంగా ఉండాలనే ఉద్దేశ్యంతో వాలంటీర్లు స్వచ్ఛందంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఆర్.విజయ్ తెలిపారు.వాలంటీర్లు సమిష్టిగా పనిచేసి పరిసరాలను శుభ్రపరచడంతో పాటు ప్రజలు సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించినట్లు విభాగాధిపతి డాక్టర్ సెంథిల్ సూచించారు.కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించిన ఫీల్డ్ కోఆర్డినేటర్ పి.సురేష్,వాలంటీర్లను స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్,గ్రామస్థులు అభినందించారు.

# కెఎల్‌యులో ప్రథమ సంవత్సర ఎంబిఏ విద్యార్థులకు అవగాహన సదస్సు

తాడేపల్లి,ఫిబ్రవరి 28,ప్రభాతవార్త : కెఎల్ బిజినెస్ స్కూల్ ఆధ్వర్యంలో సస్టైనబిలిటి అండ్



ఇఎస్‌జి స్ట్రాటజీస్ ఫర్ ఫ్యూచర్ లీడర్స్ అనే శీర్షికతో ఎంబిఏ ప్రథమ సంవత్సర విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి మేనేజ్‌మెంట్ విద్యార్థులు,అధ్యాపక సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.ఎమ్మార్ ఫ్యూచర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మేఘనరెడ్డి కొల్లి ముఖ్యవక్తగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఇఎస్‌జి గవర్నెన్స్, రిపోర్టింగ్ ప్రమాణాలు,నియంత్రణ సమ్మతి ఫ్రేమ్ వర్క్‌ల ముఖ్యఅంశాలను కూడా ఆమె వివరించారు.కార్యక్రమాన్ని కెఎల్ బిజిఎస్ స్కూల్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఎస్.వెంకటేశ్వర కుమార్ సమన్వయం చేశారు.విద్యార్థులతో చర్చాగోష్టి అనంతరం ధన్యవాదాలతో కార్యక్రమం ముగిసింది.కార్యక్రమంలో వైస్‌చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ,ప్రొఫెసర్ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్,డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్,డాక్టర్ కె.రాజశేఖరరావు,రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు,ఎంబిఏ విభాగాధిపతి డాక్టర్ బి.రమేష్‌కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు భవిష్యత్తు తరానికి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

**తాడేపల్లి,ఫిబ్రవరి 28,ప్రభాతవార్త :** కెఎల్ వర్సిటీలోని సెంటర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ ఆక్టివిటిస్ (సిఈఏ),సీఎస్ఈ-2 విభాగం ఆధ్వర్యంలో శనివారం “జాతీయ సైన్స్ దినోత్సవం” కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నూతక్కి గ్రామంలో ఘనంగా నిర్వహించారు.శాస్త్ర విజ్ఞానం మన దైనందిన జీవితంలో ఎంత ముఖ్యమో విద్యార్థులకు వివరించారు.కార్యక్రమాన్ని సీఇఏ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు,ఫ్యాకల్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ నాగమణి పర్యవేక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు



గాను యూనివర్సిటీ విసి డాక్టర్ పార్ధసారధి వర్మ,ప్రొఫెసర్ విసి డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్,డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్,డాక్టర్ కె.రాజశేఖరరావు,రిజిస్ట్రార్ కె.సుబ్బారావు,విద్యార్థుల విభాగం ఇన్‌చార్జ్ డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్,విద్యార్థుల విభాగం అడ్వైజర్ డాక్టర్ హబీబుల్లాఖాన్,అసోసియేట్ డీన్ డాక్టర్ శాంతిశ్రీ తదితరులు అభినందించారు.ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో విద్యపై అవగాహన పెంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

# కనువిందు చేస్తున్న ఉత్సవాలు

**ఆరెమండ(పొన్నూరు), ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆరెమండ గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ ఆదిపరాశక్తి ఆరెమండ్లమ్మ అమ్మవారి తిరునాళ్ళమహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలు భక్తులకు కనువిందు చేస్తున్నాయి. ప్రతి నిత్యం అమ్మవారు ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారి అలంకరణలో భక్తులు తన్మయత్వాన్ని పొందుతున్నారు. అమ్మవారికి పొంగళ్ళు, నారికేళాలు, కథలీఫలాలు తదితరాలను సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. పొన్నూరు చుట్ట ప్రక్కల మండలాలు, గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మవారికి సారె సమర్పించి మొక్కులు తీర్చుకొంటున్నారు. నిత్యవిధితోపాటు శ్రీ సుదర్శన మన్యుసూక్త దుర్గ శ్రీ దేవత్య



మహాశాంతి హోమము నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. పూర్ణాహుతి కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని హోమ ద్రవ్యాలను అగ్నికి అర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేదా హైస్కూల్ విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అమ్మవారి కుంకుమ బడి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదవినియోగం జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కమిటి సభ్యులు ఏర్పాట్లు చేశారు. రూరల్ ఎస్సై వాగాల శ్రీహరి పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

# విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శన

**కొల్లిపర, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** మండలంలోని మున్నంగిలో శనివారం మూడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శనలలో ప్రతిభ చూపారు.తక్కువ ఖర్చుతో ప్రొక్లెయినర్,బ్యాటరీతో ఫ్యాన్,టేబుల్ లైట్,అగ్నిపర్వతం,కాగితాలతో చేసిన రాకెట్ వంటివి విద్యార్థులు రూపొందించారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారిణి ఝాన్సీలత మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భావిశాస్త్రవేత్తలు కావాలని కోరారు.పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మునగాల ధనలక్ష్మి,సోమరౌతు లక్ష్మీకమల, షబానా



తబస్సుమ్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులు అనేక ప్రాజెక్టులు రూపొందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులలోని సృజనాత్మకతకు జాతీయ సైన్స్ దినోత్సవం ప్రత్యేకతను సంతరించుకుందని ఎంఇవో ఝాన్సీలత స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఎం వర్సిటీలో ఇండో జర్మన్ సమావేశం

### హాజరైన జర్మన్ బయోలాజికల్ సైన్స్ శాస్త్రవేత్తలు

**మంగళగిరి, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త :** ఏపీ ఎస్ ఆర్ ఎం యూనివర్సిటీలో శనివారం ఇండో జర్మన్ శాస్త్రవేత్తల ప్రత్యేక సైంటిఫిక్‌సమావేశం జరిగింది. నేషనల్ సైన్స్ డే ను పురస్కరించుకొని యూనివర్సిటీ యాజమాన్యం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. బయోలాజికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ జయశీలన మురుగైన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సతీష్ కుమార్, రిజిస్ట్రర్ డాక్టర్ ప్రేమ్ కుమార్ తో పాటు జర్మన్ నుంచి విచ్చేసిన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. బెర్లిన్ లోని ఫ్రీయి యూనివర్సిటీ శాస్త్రవేత్తలు డాక్టర్ థామస్ అల్టర్, డాక్టర్ ఉవే రోస్లేర్, డాక్టర్ రాబర్ట్ క్లోప్ఫన్, డాక్టర్ అనిక ఫ్రీ లు హాజరయ్యారు. సమావేశమైన శాస్త్రవేత్తలందరూ మైక్రోబయల్ ఫుడ్ సేఫ్టీ, మాలిక్యులర్ ఎపిడేమియాలాజీ, వెటర్నరీ



పాథాలజీలపై చర్చించారు. నేషనల్ సైన్స్ డే ను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో యూనివర్సిటీకి డీన్ డాక్టర్ సి వి టామీ, పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు

# విద్యార్థుల్లో ఆవిష్కరణ స్ఫూర్తి పెంపు

**మంగళగిరి, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** నేషనల్ సైన్స్ డే సందర్భంగా నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీలోని ఫార్మస్యూటికల్ అనాలిసిస్ విభాగం ఆధ్వర్యంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్



సహకారంతో “ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూర్షిప్ ఎక్స్పోజర్ విజిట్“ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం యొక్క థీమ్ “ఇన్నోవేషన్ ఎక్స్పోజర్“.ఈ కార్యక్రమం మంగళగిరిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లో జరిగింది. కార్యక్రమానికి మయూరి టెక్ పార్క్, మంగళగిరి, ప్రాయోజకత్వం వహించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసోసియేట్ మేనేజర్ గోపీచంద్ పాల్గొని ప్రసంగించారు. నవీన ఆవిష్కరణలు, సృజనాత్మక ఆలోచన, వ్యాపార స్ఫూర్తి ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమని విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. నేహా ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూర్షిప్ పై తన విలువైన ఆలోచనలను పంచుకున్నారు.కార్యక్రమం ప్రారంభంలో డా. జి. స్వప్న, విభాగాధిపతి, స్వాగత ప్రసంగం అందించారు. విద్యార్థులు పరిశ్రమలకు దగ్గరగా ఉండి, ఆవిష్కరణలకు ప్రాధాన్యతనివ్వడం ఎంత ముఖ్యమో వివరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 115 మంది పాల్గొన్నారు, వీరిలో 110 మంది బి.ఫార్మసీ విద్యార్థులు ఉన్నారు. పాల్గొన్న విభాగాధిపతులు డా. జి. స్వప్న, జి. సాయి శ్రీ లక్ష్మి, పి. జ్యోతి, వి. పద్మజ, పి. పార్వతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనా విధానం అభివృద్ధి చేయడం మరియు వ్యాపార స్ఫూర్తిని పెంపొందించడం సందర్శన ద్వారా విద్యార్థులకు ఇన్నోవేషన్, స్టార్ట్అప్ పద్ధతులపై ప్రాయోగిక అవగాహన లభించింది. కార్యక్రమాన్ని విజయవంతంగా డా. జి. స్వప్న, ఫార్మస్యూటికల్ అనాలిసిస్ విభాగం సమన్వయకర్తగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసినటువంటి అనాలసిస్ విభాగాన్ని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి పాముల రెడ్డి అభినందించారు.

# కన్నుల పండువగా స్వామి వారి వసంతోత్సవం

**కొల్లిపర,పిబ్రవరి 28 ప్రభాతవార్త:** మండల కేంద్రం కొల్లిపర శ్రీదేవి భూదేవి సమేత శ్రీజనార్దనస్వామి దేవాలయంలో వార్షిక



బ్రహ్మోత్సవములలో భాగ ంగా శనివారం స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు పరాశరం జగన్నాధాచార్యులు ప్రత్యేక పూజలు చేసారు.ఉదయం 7 గంటలకు స్వామి వార్లకు నిత్యహోమము,బలిహరణ వంటి కార్యక్రమాలు కన్నుల పండువగా నిర్వహించారు.అనంతరం స్వామి వారికి వసంతోత్సవం..చక్రస్నానం వంటి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.రాత్రి 7 గంటలకు పూర్ణాహుతి,ధ్వజారోహణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు.భక్తులకు మంత్ర పుష్పంతో పాటు తీర్థప్రసాదాలు అందజేయటం జరిగింది.తరువాత శ్రీజనార్ధనస్వామి ఆలయం ఎదుట శ్రీఆమని నృత్య కళానిలయం వారి సౌజన్యంతో కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు.నృత్య ప్రదర్శన పలువురును ఆకట్టుకుంది.భక్తులు ఈ కార్యక్రమాలు చూసేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయం విద్యుత్‌ధీపాలతో దగదగ మెరిసింది.ఆయా కార్యక్రమంలో పండితులు అర్చకులు పరాశరం రామాచార్యులు, రమణశర్మ, చిలుకూరు వెంకటేశ్వరశర్మ, కలువకొల్లు వీరభద్రయ్య, సీతా రామాచార్యులు,నాగరాజు శర్మలు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

# టైలర్లకు రుణ సౌకర్యం కల్పించాలి

**కొల్లిపర, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** సమాజంలో టైలర్ వృత్తిదారులకు ప్రభుత్వం రుణ సౌకర్యం కల్పించాలని కొల్లిపర మండల టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ రఫీ కోరారు.శనివారం మండల కేంద్రమైన కొల్లిపరలో మండల టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.కుట్టుమిషన్ సృష్టికర్త విలియం ఎలియాస్ హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా షేక్ రఫీ మాట్లాడుతూ టైలర్ల వృత్తి దుర్భరంగా మారడానికి రెడీమేడ్ దుస్తుల విక్రయాలు పెరగడమే కారణమని ఆందోళన వ్యక్తం చేశారు.టైలర్ల వృత్తి కనుమరుగయ్యే పరిస్థితికి ప్రభుత్వ సహకారం లేకపోవడమేనన్నారు.

## పిడుగురాళ్లలో పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే 'యరపతినేని'

**పిడుగురాళ్ల, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త :** పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. పట్టణంలోని 6, 7 వార్డులకు





చెందిన లబ్ధిదారులకు వివిధ రకాల పింఛన్లను అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఇరువూరి శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని పొడి చెత్తను ఇళ్ల వద్దే తీసుకునే వారికి కావాల్సిన నిత్యావసర సరుకులు అందించే కార్యక్రమంలో భాగంగా పిడుగురాళ్ల మండల స్వచ్ఛరథంను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రారంభించారు.

## తంగుటూరి వెంకట సుబ్బారావు చారిటబుల్ ట్రస్టు అన్నదానం

**పిడుగురాళ్ల, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త :** పట్టణంలో సున్నం ఉత్పత్తి వ్యవస్థాపకుడు స్వర్గీయ తంగులూరి పెద్ద సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు లయన్స్ క్లబ్ జోన్ ప్రెసిడెంట్ తంగుటూరి సతీష్



ఆధ్వర్యాన మాయాబజార్లో కుసుమ హరనాథ్ ఆలయం వద్ద పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు పాండురంగ శ్రీను మాట్లాడుతూ తంగుటూరి వెంకట సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన సతీష్ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ప్రయాణికుల దాహం తీర్చేందుకు మినరల్ వాటర్ కూలర్‌ను బహుకరించారన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆవుల జనార్ధన్, కుసుమ హరనాథ్ ఆలయం కమిటి సభ్యులు, గోల్డ్ మర్చంట్ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## 14న జాతీయ లోక్‌అదాలత్

**గురజాల, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త :** మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో ఈనెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పదో అదనపు జిల్లా జడ్జి ప్రియదర్శిని తెలిపారు. రాజీపడదగిన సివిల్, క్రిమినల్, బ్యాంకు, చెక్‌బౌన్స్, మోటారు వాహన ప్రమాదాలు, ముందస్తు వాజ్యము తదితర కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కలిసికట్టుగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దాం: ఎమ్మెల్యే యరపతినేని

**గురజాల, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త :** అందరం కలిసికట్టుగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దామని గురజాల నియోజకవర్గ శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం పట్టణంలోని చల్లగుండ్ల గార్డెన్స్‌లో నిర్వహించిన నియోజకవర్గస్థాయి అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, రానున్న రోజుల్లో చేయాల్సిన అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో చర్చించారు. ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ



పథకాలు అందాలని, ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి నేరుగా పేదవాడికి అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. గతంలో కన్నా నియోజకవర్గ అభివృద్ధికి కావాల్సిన ఆర్థిక వనరులను ప్రభుత్వాన్ని అడుగుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగార్జున సాగర్ కుడికాలువ చైర్మన్ పులుకూరి కాంతారావు, ఆర్డీవో మురళీకృష్ణ, డీఎల్‌డీవో గబ్రూనాయక్, ఏపీసీపీడీసీఎల్ ఈఈ సింగయ్య, పంచాయతీరాజ్ డీఈ కోటేశ్వరరావు, హౌసింగ్ ఈఈ బాలాజీనాయక్, అగ్రికల్చర్ ఏడీ శ్రీకృష్ణదేవరాయలు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటటేశ్వర్లు, తహసీల్దార్ దుర్గేష్, ఎంపీడీవో గౌసియాబేగం, కమిషనర్ శివన్నారాయణ, మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ బడేజాని, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కటకం అంకారావు, టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ కన్వీనర్ ఆకుల పిచ్చయ్య గుప్తా, అడపా శ్రీనివాసరావు, బొల్లయ్య, శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టైలర్స్‌డే

**గురజాల, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త ::** పట్టణంలో శనివారం టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కొట్ల బజారులోని టైలర్స్ జెండాను టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ ఇన్‌చార్జి చైర్మన్ బడేజానిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు



మాట్లాడుతూ చేతి వృత్తుల్లో ముఖ్యమైన వృత్తి టైలరింగ్ అన్నారు. టైలర్స్ ఐక్యమత్యంతో ఉండాలన్నారు. చేతివృత్తుల వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పోటు నాగేశ్వరరావు, నేలవెల్లి బొల్లయ్య, నవులూరి శ్రీరామ్మూర్తి, టైలర్స్ అంజి మేస్త్రి, సినీ టైలర్ షేక్ వలి, శ్రీను, ఇమాన్సా తదితరులు పాల్గొన్నారు.

## నిరక్షరాస్యులకు 'అక్షరాంధ్ర' ద్వారా ఉచిత పరీక్షలు: ఎంపీడీఓ

**కారంపూడి, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వేపకంపల్లి గ్రామంలో నిరక్షరాస్యులైన వారికి అక్షరాలు నేర్పి అక్షరాంధ్ర ద్వారా ఫ్రీ పరీక్షలను శనివారం ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి,



మండల అధ్యక్షురాలు బొలినేడి కనకదుర్గా శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని నిరక్షరాస్యులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. పరీక్షలు రాసిన వారికి తదుపరి పరీక్షలకు సిద్ధపడే విధంగా అక్షరాంధ్ర పుస్తకాలు, పెన్సిళ్లు, రబ్బర్లు, పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా వేలిముద్ర వేయడం మానేసి సంతకాలు చేసే విధంగా నిరక్షరాస్యులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఉపాధి పనుల ఫీల్డ్ అసిస్టెంట్స్, ఉపాధి సిబ్బంది, పీఓఆర్డీ శ్రీనివాసరెడ్డి, ఏపీఓ కట్టా నాగేశ్వరరావు, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ

**కారంపూడి, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** కారంపూడి శుద్ధగుంతల కాలనీలో అర్హులైన లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు తెదేపా రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ ప్రతి అర్హుడికి ఆలస్యం లేకుండా ప్రభుత్వం అందించే



సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల సంక్షేమం కోసం తీసుకున్న ప్రతి నిర్ణయం పటిష్టంగా అమలయ్యేలా పర్యవేక్షణ సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, తుపాకుల రత్తయ్య పాల్గొన్నారు.

## ఘనంగా జనసేన సభ్యత్వ నమోదు ఉత్సవాలు

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

**కారంపూడి, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** స్థానిక శ్రీసత్యసాయిబాబా కళ్యాణ మండపంలో మాచర్ల నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు ఉత్సవాలు ఘనంగా



నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పాల్గొని జనసైనికులను ఉద్దేశించి మాట్లాడారు. నియోజకవర్గంలో అత్యధికంగా పార్టీ సభ్యత్వాలు చేయాలని, జనసైనికులు ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి పులి హరి, మండల అధ్యక్షులు మండల కార్యదర్శులు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## పేదల అభ్యున్నతే 'కూటమి' ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

**మాచర్ల, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** పేద ప్రజల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం స్థానిక 28వ వార్డు వినాయకుని గుట్ట కాలనీలో



ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం లో పింఛను పెంచుతామని నిలువునా మోసం చేశా న్నారు. ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం మొదటి రోజు నుంచే పెంచిన పింఛను పేదలకు అందజేసిందని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో ప్రశాంత వాతావరణంలో సంక్షేమం పేదలకు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నారాయణ స్కూల్‌లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

**మాచర్ల, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** స్థానిక నారాయణ పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంఈఓ కోటేశ్వరరావు, వెల్దుర్తి రెవెన్యూ అధికారి రాజశేఖరనాయక్, ఏజీఎం జానకిరామిరెడ్డి పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సైన్స్ ప్రాజెక్టులను తిలకించారు. సీవీ రామన్, అబ్దుల్ కలాం చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఆర్‌అండ్‌డీ హెడ్ వాణి, సింహాద్రి, కోఆర్డినేటర్ భద్రా రెడ్డి, గౌసియా బేగం, రిహానీ, ప్రిన్సిపల్ ఉల్లారెడ్డి, సైన్స్ టీచర్లు అమ్మరాజు, చైతన్యవాణి, శైలజా, మనోహర్, గురులక్ష్మి, కమలాసన్, శారద, స్కూల్ ఇన్‌ఛార్జిలు ఆంజనేయులు, ఉదయలక్ష్మి, రాజేశ్వరి, రవినాయక్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## వ్యాసరచన పోటీల్లో పలనాడు కళాశాల విద్యార్థుల ప్రతిభ

**మాచర్ల, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** పల్నాడు జిల్లా స్థాయిలో వ్యాసరచన పోటీలో స్థానిక పలనాడు కళాశాల విద్యార్థిని జుబేదా తబస్సుమ్ మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని ప్రతిభ చాటింది. హార్ట్



ఫుల్ నెస్ జాతీయ సంస్థ ఇంటర్ విద్యార్థులకు అఖిల భారత స్థాయిలో ఇతరుల మద్దతు లేకుండా వ్యక్తిగత పరిణామం సాధ్యం కాదు అనే అంశంపై వ్యాసరచన పోటీ జరిగింది. ఈ పోటీలో కళాశాల విద్యార్థులు రాచమడుగు సుహశ్రీ, కె.లక్ష్మిగోవిందమ్మ, షేక్ నజ్మాలకు సంస్థ ప్రతినిధులు కూకట్ల శ్రీనివాసరావు, పాశం కృష్ణారెడ్డి, గాజుల నాగేశ్వరరావు, కూకట్ల లక్ష్మీ చెన్నకేశవరావు, జేవీకేఎస్ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ శివభాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పఠాన్ నాగూర్‌వలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోటరీక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు

**మాచర్ల, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** మాచర్ల రోటరీక్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్ మేనేజర్ దివాకర్ పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రముఖ కంటి వైద్యులు అలవల రామకృష్ణారెడ్డి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన విద్యార్థులకు రూ.20 వేలు



విలువవ చేసే కళ్లజోళ్లను పంపిణీ చేశారుళీ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేంద్రియానాం నయనం ప్రధానం అని పేర్కొన్నారు. మనకున్న జ్ఞానేంద్రియాలల్లో కళ్ల అత్యంత ప్రాముఖ్యమైనవన్నారు. శరీరంలో కంటికి అత్యధిక ప్రాధాన్యత ఉందని డాక్టర్ కొండవీటి రామకోటయ్య తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు తుమ్మల సత్యప్రసాద్, క్లబ్ సభ్యులు పఠాన్ నాగూర్‌వలి, కోనేరు శంకర్, కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెల్దుర్తిలో నేడు ప్రజాదర్బార్: ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

**వెల్దుర్తి, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:**మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రజాదర్బార్ జరుగుతుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజలు ఫిర్యాదులను అర్జీల రూపంలో అందజేయవచ్చన్నారు. ఉదయం 9 గంటలకు సీఎం సహాయనిధి నగదు చెక్కులను లబ్ధిదారులకు అందజేయనున్నారు.



## సామాజిక పింఛన్లతో పేదలకు ఆసరా: జూలకంటి అక్కిరెడ్డి

**వెల్దుర్తి, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్లతో పేద కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలుస్తుందని టీడీపీ యువ నాయకుడు జూలకంటి అక్కిరెడ్డి అన్నారు. మండల



కేంద్రమైన వెల్దుర్తిలో శనివారం ఇంటింటికి తిరిగి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు వెల్దుర్తి గ్రామంలో పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నడూలేని విధంగా పింఛన్లు లబ్ధిదారులకు అందజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి గ్రామ మాజీ సర్పంచ్ కేజిరెడ్డి వెంకటరెడ్డి, గ్రామపెద్దలు జూలకంటి వెంకటరెడ్డి, జూలకంటి సుందరరామిరెడ్డి, పులుసు గురవారెడ్డి, పులుసు వీరారెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఆర్‌డీసీ సెట్ - 2026 బ్రోచర్ ఆవిష్కరణ

**విజయపురిసౌత్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** నాగార్జునసాగర్ ఏపీఆర్‌డీసీ సెట్ - 2026 ప్రవేశ పరీక్ష బ్రోచర్‌ను కళాశాల ప్రిన్సిపల్ నయీమ్‌బాను ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన



ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో ఏపీఆర్‌డీసీ కృషి చేస్తుందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన, విద్యలో ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఉచిత విద్య, వసతి, భోజనం వంటి సదుపాయాలు అందించడం సంస్థ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 24న అన్ని జిల్లా కేంద్రాల్లో జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తులు ఫిబ్రవరి 18 నుంచి మార్చి 31వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దాతల సహకారంతో జ్యోతి ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం: న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** సత్తెనపల్లి పట్టణంలోని మార్టిన్ పేటలో ఉన్న జ్యోతి పౌండేషన్‌లో శనివారం కిలారి శ్రీనివాసరావు,సువర్ణలక్ష్మి వివాహ వార్షికోత్సవ సందర్భంగా వారి ఆర్థిక సహాయంతో నిరుపేద వృద్ధులకు మరియు ఆ ప్రాంత వాసులకు భోజనం అందించారు. జ్యోతి పౌండేషన్ అధ్యక్షురాలు వలేటి కుమారి ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం జరిగింది. వలేటి కుమారి మాట్లాడుతూ ఈనాటి దాతలకు మరియు వీరి కుటుంబ సభ్యులకు



హృదయ పూర్వక ధన్యవాదాలు అని తెలిపారు. ఇలాంటి దాతల దాతృత్వంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం సాధ్యం అవుతుంది అని అన్నారు. దాతలు భవిష్యత్తులో ముందుకు వస్తే సక్రమంగా, సకాలంలో సద్వినియోగం చేస్తూ మా సంస్థ పలు సేవా కార్యక్రమాలు చేయటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

## 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' లో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే 'కన్నా'



**సత్తెనపల్లి, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** సత్తెనపల్లి ఎమ్మెల్యే కార్యాలయం లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శనివారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ఈసందర్భంగా కన్నా మాట్లాడుతూ, గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా నేడు 'కూటమి' ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు. తన దృష్టికి కొన్ని సమస్యలు. గృహ,పెన్షన్, వైద్యం,పలు సమస్యలు తీసుకొచ్చారని, సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. .అందరి సమస్యలు పరిష్కరిస్తామని, కన్నా హామీనిచ్చారు.

## 'పరివర్తన' చిన్నారులకు అన్నదానం

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** స్థానిక 'పరివర్తన' చెవిటి, మూగ, మానసిక వికలాంగుల ఆశ్రమంలో పట్టణానికి చెందిన విజన్ హైస్కూల్ డైరెక్టర్ బూతుకూరి హనిమిరెడ్డి, తిరుమల దేవి తనయుడు బూతుకూరి మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా చిన్నారులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. హనిమిరెడ్డి



మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ సేవా భావంతో పరివర్తన చిన్నారులకు సహాయ, సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విజన్ స్కూల్ మాస్టర్ అబ్రహం తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా దాతలకు 'పరివర్తన' నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా దేవరంపాడు నేతివెంకన్న స్వామి తిరునాళ్ల

**రాజుపాలెం,ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** రాజుపాలెం మండలం దేవరంపాడు లో శ్రీ స్వయంభు మత్స్యవతార వెంకటేశ్వర స్వామి తిరునాళ్ల మహోత్సవం వైభవంగా జరిగింది. వందలాది మంది భక్తులు శనివారం స్వామివారిని దర్శించుకున్నారు. సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ



,నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి.స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు .

## క్షయవ్యాధి గ్రస్థులకు ఫుడ్ బాస్కెట్స్ అందజేత

**రాజుపాలెం,ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి ఆదేశాల మేరకు రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాబి రూట్స్ ఫౌండేషన్ అందచేసిన ఫుడ్ బాస్కెట్స్‌ను మండలంలోని 20 మంది క్షయ వ్యాధి గ్రస్తులకు ఫుడ్ బాస్కెట్స్ డాక్టర్ పాల్ రవి అందచేసినారు. డాక్టర్ పాల్ రవి మాట్లాడుతూ టీ.బి.వ్యాధి గ్రస్తులు టీ.బి.మందులు తో పాటు ఈ పోషకాలు కలిగిన ఆహారం తీసుకోటం వలన వ్యాధి నిరోధక శక్తి పెరిగి వ్యాధి వెంటనే తగ్గుతున్నది అని తెలియచేసినారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ప్రత్తి జీవన్ రావు, ఫార్మాసిస్ట్ శివ మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపి సీనియర్ నేత మాబుకు ఆర్థికసాయం

**పెదకూరపాడు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** మండలంలోని పాటిబండ్ల గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు షేక్ మాబు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక సమస్యలు తో ఇబ్బంది పడుతున్నారు. విషయం



తెలుసుకున్న అదికూరపాడు టిడిపి మాజీ అధ్యక్షులు అర్తిమల్ల రమేష్, మండల టిడిపి అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, సీనియర్ నాయకులు మద్దినేని వెంకట సత్యనారాయణ రైతు ఖర్చులు నిమిత్తం ఆర్థిక సహాయాన్ని శనివారం అందించారు. అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు బాబుకి టిడిపి మండల నేతలు ఎల్లవేళలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, ఎస్సీ సెల్ నాయకులు పాటిబండ్ల యెహోను, జిల్లా టిడిపి ఉపాధ్యక్షురాలు షేక్ ముంతాజ్, గల్లా బాబురావు,బెల్లంకొండ రామగోపాల్ రావు, ఆంధ్ర ప్రసాద్, గంగినేని లీలావతి, బాలిరెడ్డి, రత్తయ్య, సుభాని, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

## 'మిస్ ఇండియా' చేతులమీదుగా శాంసన్‌కు 'భారత్ ఎక్సలెన్స్' ప్రదానం

**క్రోసూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** మిస్ ఇండియా 2025 అంబాసిడర్ బి అమూల్య ప్రియదర్శిని చేతుల మీదగా ఆశ్రయ చారిటబుల్ ట్రస్ట్ , సత్తనపల్లి వారిచే శనివారం విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం బాలోత్సవం భవన్ సెకండ్ ఫ్లోర్ నందు జరిగిన కార్యక్రమంలో




తనకు అవార్డు ప్రధానం చేసినట్లు శిఖా శాంసన్ సాయంత్రం క్రోసూరు లో జరిగిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. గత 36 సంవత్సరాలుగా వైద్య ఆరోగ్య రంగంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు గూర్చి మరియు చేస్తున్న అనేక సాంఘిక సేవా కార్యక్రమాలు గాను తనకు ఈ అవార్డు లభించినట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రయ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పరంధామయ్య, జాతీయస్థాయి ప్రముఖ చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా శాంసన్ ఆశ్రయ చారిటబుల్ ట్రస్ట్ కమిటీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు

## బాల్యవివాహాల నియంత్రణపై అవగాహన

**పెదకూరపాడు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** అంగన్వాడి మూడో సెంటర్ నందు శనివారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హెచ్‌ఎం రమణ పాల్గొన్నారు. చిన్న వయసులో




పిల్లలకు పెళ్లి చేయడం ద్వారా గర్భం దాల్చినప్పుడు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంటుందని తెలిపారు. పిండం అభివృద్ధి చెందక అంగవైకల్యం కలిగిన బిడ్డలు పుట్టే అవకాశం ఉందన్నారు. 18 సంవత్సరాల నిండిన యువతులకు 21 సంవత్సరాలు నిండిన యువకుడికి పెళ్లిడుగా ప్రభుత్వం నిర్ణయించిందని వారన్నారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిపిఎస్ నాగమ్మ ఐసిడిఎస్ సూపర్వైజర్ హిమాంబి అంగన్వాడీ కార్యకర్త గౌస్య తదితరులు పాల్గొన్నారు.



# బాపట్ల జిల్లా వార్త

## పేదలకు వరం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

**నిజాంపట్నం, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు పేదల జీవితాలకు భరోసా అని జడ్‌పిటిసి సభ్యుడు నర్రా సుబ్బయ్య అన్నారు. శనివారం మండల కేంద్రమైన నిజాంపట్నంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షల మంది పేదల ఒకటవ తారీఖు ఎప్పుడు వస్తుందా తమ ఖర్చులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందా అని ఎదురు చూస్తుంటారని తెలిపారు. పేదల అభ్యున్నతికి పాటుపడే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో తెదెపా నాయకులు ఖాదర్‌బాబు, నర్రా సుందరయ్య, నక్కల పోలిరాజు తదితరులు పాల్గొన్నారు.



## కౌన్సిల్ సమావేశంలో 13 అంశాలకు ఆమోదం

**రేపల్లె, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** పట్టణంలో అభివృద్ధి పనులకు సంబంధించి ఎజెండాలో పొందుపరచిన 13 అంశాలను చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. శనివారం జరిగిన రేపల్లె మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ కట్టా మంగ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ కట్టా మంగ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పురపాలక సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు, వైస్ ఛైర్మన్ జి.ప్రశాంత్‌కుమార్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



## కట్న,కానుకల పేరుతో సాగుతున్న వేధింపులను అరికట్టాలి

### కలెక్టర్ వినోద్ కుమార్

**బాపట్ల, ఫిబ్రవరి 28,ప్రభాతవార్త:** కట్న కానుకల పేరుతో సాగుతున్న వేధింపులను అరికట్టేందుకు డౌరీ నిషేధ చట్టాన్ని జిల్లాలో అత్యంత కఠినంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక జిల్లా కలెక్టరేట్ బోర్డు రూమ్‌లో నిర్వహించిన ఖిజిల్లా సలహా మండలిఖి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. డౌరీ నిషేధ చట్టం పట్ల సామాన్య ప్రజల్లో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కేసుల పరిష్కారంలో జాప్యం వద్దు:జిల్లాలో నమోదవుతున్న కట్న వేధింపుల కేసులను క్షుణ్ణంగా పరిశీలించాలని, వీటి పరిష్కారంలో ఎటువంటి జాప్యం జరగకుండా చూడాలని అధికారులను హెచ్చరించారు. మహిళల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ భావన, ఐసీడీఎస్ పీడీ రాధ మాధవి, డీఎస్పీ జగదీష్ నాయక్, ఎన్‌జీవో ప్రతినిధులు పార్థసారథి, రవి ప్రదీప్, పద్మ తదితరులు పాల్గొన్నారు



## పరీక్షలలో విద్యార్థులు మెళుకువలు పాటించాలి

**రేపల్లె, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు మెళుకువలు పాటించాలని రేపల్లె మండల విద్యాశాఖ అధికారి సురేష్ చెప్పారు. రేపల్లె పట్టణ ఆదర్శవేదిక ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని త్రిబుల్ ఎస్ పురపాలక ఉన్నత పాఠశాలలో 55 మంది విద్యార్థులకు అవసరమైన ప్యాడ్, స్కేల్, పెన్, పెన్సిల్, షార్ప్‌నర్, ఎరైజర్ తదితర పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర భంగా ఎంఇవో సురేష్ మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలను తీర్చడంలో దాతల సహకారం లభించడం అభినందనీయమన్నారు. పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదని ప్రిపరేషన్‌లో తగిన జాగ్రత్తలు తీసుకుంటే సులువుగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు పొందవచ్చున్నారు. 15 రోజులు కష్టపడి చదివితే విద్యార్థులు మంచి మార్కులు సాధించగలరన్నారు. రేపల్లె పట్టణ ఆదర్శవేదిక కార్యదర్శి యడ్లపల్లి కిషోర్‌బాబు మాట్లాడుతూ రేపల్లె పట్టణం, రూరల్ మండలం ప్రాంతంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని దాతల సహకారంతో అందజేస్తున్నట్లు చెప్పారు. ఏకాగ్రతతో విద్యార్థులు పరీక్షలకు సిద్ధమై హాజరై తల్లిదండ్రులకు, విద్యా సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో త్రిబుల్ ఎస్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.కోటేశ్వరి, రేపల్లె పట్టణ ఆదర్శ వేదిక సభ్యులు ఽ.నటరాజు, ఎన్.సాయికృష్ణమాచార్యులు, కె.వెంకటేశ్వరరావు, జి.సాంబశివరావ ు, కె.ఆనందరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## ఈవీఎంల భద్రతలో అలసత్వం వద్దు

**బాపట్ల, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి అశ్రద్ధకు తావులేదని, అడుగడుగునా నిరంతరం నిఘా ఉండాల్సిందేనని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన స్థానిక ఈవీఎం గోదాములను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాముల్లోని భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరును స్వయంగా పరిశీలించారు. గోదాముల షెట్టర్లకు వేసిన సీల్స్‌ను తనిఖీ చేసి భద్రతా పరమైన అంశాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందితో ఆయన మాట్లాడారు. 24 గంటల పాటు అహర్నిశలు ఈవీఎంలకు కాపలా ఉంటున్న పోలీసులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదన్నారు వారికి మరుగుదొడ్లు, తాగునీరు వంటి కనీస సౌకర్యాలను తక్షణమే కల్పించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో డీఆర్వో జి.గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు షేక్ షఫీ, ఆర్ అండ్ బీ డీఈ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



## కూటమిపాలనలోనే ప్రజల సంక్షేమం

**భట్టి ప్రోలు(రేపల్లె), ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** భారతదేశంలోనే సామాజిక పెన్షన్ల పంపిణీలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా చెప్పారు. శనివారం మండల కేంద్రమైన భట్టిప్రోలులో పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తూనుగుంట్ల సాయిబాబా మాట్లాడుతూ కూటమి పాలనలో ప్రజల సంక్షేమం నెరవేరుతున్నదన్నారు. ప్రతి నెల 1వ తేదీ సెలవైతే ముందు రోజే పెన్షన్ పంపిణీ చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలుచేస్తున్నారని తెలిపారు. ఇంటి వద్దకే వెళ్ళి పెన్షన్ల పంపిణీ చేయడం వలన పెన్షన్ దారులు సంతృప్తి చెందుతున్నారని ఆయన చెప్పారు. అర్హులైన పలురకాల పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని సాయిబాబా వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎన్.దేవరాజ్, తెలుగుదేశం పార్టీ నాయకులు కంభం సుధీర్, ఎస్.బాబూరావు, యర్రంశెట్టి కరుణశ్రీనివాసరావు, అబ్దుల్ కలాం, కుక్కల వెంకటేశ్వరరావు, అధికారులు, ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.



## పరీక్షా కేంద్రాల్లో పకడ్బందీ నిఘా

### మాస్ కాపీయింగ్‌కు తావుండకూడదు : కలెక్టర్

**పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ పరీక్షలను ఎంతో పారదర్శకంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి అధికారులను ఆదేశించారు. శనివారం పిట్టలవానిపాలెం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలోని ప్రతి గదిని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును గమనించారు. హాజరు వివరాలను పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ జి.మల్లేశ్వరిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రంలో 57 మంది విద్యార్థులకు గాను 56 మంది హాజరైనట్లు ఆమె వివరించారు. 144 సెక్షన్ అమలు: పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్‌ను కఠినంగా అమలు చేయాలని, మాస్ కాపీయింగ్ వంటి అక్రమాలకు ఏమాత్రం అవకాశం ఇవ్వకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా బాటనీ, హిస్టరీ, ఒకేషనల్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. మొత్తం 2,032 మంది విద్యార్థులకు గాను 1,876 మంది హాజరయ్యారని, 56 మంది గైర్హాజరైనట్లు గణాంకాలను వెల్లడించారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీ విషయం తెలియగానే మండల తహసిల్దార్ వెంకటేశ్వరరావు హుటాహుటిన పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. పరీక్షల నిర్వహణలో ఎక్కడా లోపాలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.



## టైలర్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

**భట్టి ప్రోలు(రేపల్లె), ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి జీవనోపాధి కోల్పోతున్న టైలర్ కుటుంబాలను ఆదుకోవాలని భట్టి ప్రోలు మండల టైలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ ఇస్మాయిల్ కోరారు. శనివారం ప్రపంచ టైలర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక సాయికృష్ణ కళా మండపంలో సమావేశం నిర్వహించారు. కుట్టుమిషన్ సృష్టికర్త విలియం ఎలియాస్ హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ మాట్లాడుతూ రెడీమెడీ దుస్తుల రాకతో టైలర్ల వృత్తి ప్రమాదంలో పడిందన్నారు. ప్రభుత్వ సహకారం ఉంటేనే దర్జీ వృత్తి మనుగడ సాగించలగదన్నారు. టైలర్లను అనారోగ్య పరిస్థితులు పీడిస్తున్నాయని చెప్పారు. సబ్సిడీపై మెటీరియల్ పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పేద టైలర్లకు నివేశన స్థలాలను పంపిణీ చేసి ఇంటి నిర్మాణాన్ని ప్రభుత్వమే చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు, ఉద్యోగుల యూనిఫారం కుట్టే బాధ్యతను టైలర్లకే అప్పగించి ఉపాధి చూపాలని ఇస్మాయిల్ కోరారు. సీనియర్ టైలర్ వేల్పూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం మంజూరు చేసిన విధంగా రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేయాలని, 50 సంవత్సరాలకే పెన్షన్ పథకాన్ని టైలర్లకు వర్తింపచేయాలని సూచించారు. ఈ సమావేశంలో నాగిశెట్టి సుబ్బారావు, రావులపల్లి రాంబాబు, రఫీ, నాగరాజు, షంషుద్దీన్, పి.రంగ నాయకులు, పరిశ నాగేశ్వరరావు, షేక్ మొహిద్దీన్ బషీర్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.



**రేపల్లె పట్టణంలో..**

కుట్టుమిషన్ సృష్టికర్త విలియం సేవలు చిరస్మరణీయమని రేపల్లె శ్రీ చైతన్య టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభానీ అన్నారు. కుట్టుమిషన్ కనుగొన్న విలియం ఎలియాస్ హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దర్జీ వృత్తి కొనసాగడానికి హోవే కారకులని చెప్పారు. దర్జీ వృత్తిని ప్రభుత్వం ప్రోత్సహించాలని అన్నారు. ఈ సమావేశంలో టైలర్స్ అసోసియేషన్ నాయకులు దారం సుబ్బారావు, లోయ శ్రీనివాసరావు, జి.మధుసూధనరావు, పి.మల్లికార్జున రావు, అన్వర్, శౌంతి లక్ష్మణరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్లను పంపిణీ చేసిన కలెక్టర్

**బాపట్ల, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** ప్రభుత్వం మీకు తోడుగా ఉంది.. ఏమాత్రం ఆందోళన చెందకండి" అని నిరుపేదలకు భరోసానిస్తూ బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి కీలక నిర్ణయం తీసుకున్నారు. మార్చి 1వ తేదీ ఆదివారం సెలవు కావడంతో, లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఒకరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదును వారి గడప వద్దకే వెళ్లి పంపిణీ చేశారు. గుడిసెలోకి వెళ్లి పలకరింపు.. బాపట్ల పట్టణం, చిల్లర గొల్లపాలెంలో కలెక్టర్ పర్యటించారు. లబ్ధిదారులు బోయన ముసలయ్య, బోయిన యశోదలను వారి నివాసంలోనే కలిసివారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో ఆ కాలనీలో సైడ్ కాలువలు లేవని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. తక్షణమే పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆడియో సందేశాన్ని వినిపించిన అనంతరం, పింఛన్ నగదును అందజేసి వారిలో ధైర్యాన్ని నింపారు. జిల్లాలో భారీగా నిధుల విడుదల.. జిల్లాలో మొత్తం 1,82,897 మందికి పింఛన్లు మంజూరు కాగా, ఇందుకోసం ప్రభుత్వం రూ. 78 కోట్ల 31 లక్షల 96 వేల 500లను విడుదల చేసిందని కలెక్టర్ వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా లబ్ధిదారులందరికీ పింఛన్ పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ బి.సింగయ్య, బాపట్ల ఆర్డీఓ పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, తహసిల్దార్ షాలీమా తదితరులు పాల్గొన్నారు.



## బాపట్ల పోలీసు శాఖలో ఆత్మీయ వీడ్కోలు

### 42 ఏళ్ల సుదీర్ఘ సేవలకు ఘన సన్మానం

**బాపట్ల, ఫిబ్రవరి 28. ప్రభాతవార్త:** పోలీస్ శాఖలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అడ్మినిస్ట్రేషన్ విభాగం కూడా కీలక పాత్ర పోషిస్తుందని, ఆ విభాగంలో సుదీర్ఘకాలం సమర్థవంతంగా పనిచేసిన ఏఓ బిళ్ళ శ్రీనివాసరావు సేవలు అభినందనీయమని బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పదవీ విరమణ పొందిన ఏఓ శ్రీనివాసరావుకు ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, 42 ఏళ్ల 7 నెలల పాటు పోలీస్ శాఖలో అంకితభావంతో పనిచేయడం సాధారణ విషయ0 కాదన్నారు. మరణించిన సిబ్బంది కుటుంబాలకు అందాల్సిన ప్రయోజనాలు, పదవీ విరమణ పొందిన వారికి రావలసిన బకాయిలను ఎటువంటి జాప్యం లేకుండా అందించడంలో శ్రీనివాసరావు ప్రత్యేక శ్రద్ధ చూపారని కొనియాడారు. రాష్ట్రంలోనే 100 ఈఎస్ఎమ్ ప్రక్రియను పూర్తి చేసిన ఏకైక జిల్లాగా బాపట్ల నిలవడంలో ఆయన పాత్ర కీలకమని, ఈఆఫీస్ విధానాన్ని కూడా సమర్థవంతంగా అమలు చేశారని పేర్కొన్నారు. ఉద్యోగ బాధ్యతల ఒత్తిడిని అధిగమిస్తూ ఆయన అందించిన సేవలకు గానూ కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ఉందన్నారు. రిటైర్మెంట్ అనంతరం ఆయన కుటుంబంతో కలిసి ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. అలాగే, భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు. అనంతరం ఏఓ దంపతులను ఎస్పీ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ బి. నారాయణ, సోషల్ మీడియా ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, అడ్మిన్ ఆర్ఐ షేక్ మోలుద్దీన్, సూపరింటెండెంట్లు షేక్ కరీముల్లా, కె. రాధా, సిబ్బంది, ఏఓ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## దైవం పట్ల భక్తి కలిగి ఉండాలి

**నిజాంపట్నం, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ దైవం పట్ల భక్తి కలిగి ఉండాలని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని గరువుపాలెం శివారు పిల్లలవారిపాలెంలో అవర సాంబశివరావు, లక్ష్మీకుమారి కుటుంబ సభ్యులు నూతనంగా నిర్మించిన శ్రీరామభక్త అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ప్రత్యేక పూజాది కార్యక్రమాలను జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి భక్తికి శ్రీఆంజనేయస్వామివారిని నిదర్శనమన్నారు. ధైర్యానికి శ్రీఆంజనేయస్వామివారిని ప్రతి ఒక్కరూ కొలుస్తారని తెలిపారు. పరిసర గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. జై శ్రీరాం రామభక్త హనుమాన్‌కి జై అంటూ చేసిన నినాదాలతో పల్లెలు మార్మోగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజాదికార్యక్రమాలను, అభిషేకాలను, హోమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యుడు నర్రా సుబ్బయ్య, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు కొలసాని రాము, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## విద్యార్థులు శ్రద్ధగా చదవాలి

**నిజాంపట్నం, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను విద్యార్థులు శ్రద్ధగా విని అవగాహన చేసుకోవాలని ఎంపిడిఓ నాగలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని ఆముదాలపల్లి ఎంపియుపి పాఠశాలలో ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్థంకాని విషయాలను మరోసారి అడిగి తెలుసుకోవాలన్నారు. విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల హాజరు, బోధనా విధానం, మౌలిక వసతులు, ఎండిఎం పరిశీలించారు.



## విద్యార్థికి వీల్‌చైర్ అందజేత

**భట్టిప్రోలు(రేపల్లె), ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** మండలంలోని వెల్లటూరులో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హోమ్ బేస్డ్ విద్యార్థి బొజ్జ అదిత్యకు శనివారం భవిత సెంటర్ ఐఇడి ఉపాధ్యాయురాలు మేరీ మెర్సి వీల్‌ఛైర్ అందజేశారు. ప్రత్యేక అవసరాల విద్యార్థిగా ఆదిత్యను గుర్తించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొజ్జ రవి, ప్రధానోపాధ్యాయుడు వి.సురేష్‌కుమార్, ఉపాధ్యాయురాలు కృష్ణప్రియ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైభవంగా జాతీయ సైన్స్ దినోత్సవం

**కర్లపాలెం ఫిబ్రవరి 28. ప్రభాతవార్త:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను శనివారంఅత్యంత వైభవంగా నిర్వహించారు. సర్ సి.వి. రామన్ జయంతిని పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని ప్రత్తిపాటి సుభాషిణి మాట్లాడుతూ, తొలుత సి.వి. రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి విద్యార్థి నిత్యజీవితంలో శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని, పరిశోధనాత్మక ఆలోచనలతో ముందడుగు వేయాలని ఆమె ఆకాంక్షించారు. ఉపాధ్యాయుల కృషికి ప్రశంసలుగత మూడు రోజులుగా విద్యార్థుల కోసం వ్యాసరచన, పోస్టర్ మేకింగ్, క్విజ్, సైన్స్ డ్రాయింగ్ మరియు సైన్స్ ఎగ్జిబిట్ల తయారీ వంటి పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తూ, వారిలో సృజనాత్మకతను వెలికితీసినందుకు సైన్స్ ఉపాధ్యాయులు పిట్టు మల్లికార్జున రెడ్డి, అన్నపరెడ్డి శ్రీనివాసరావుల కృషిని ప్రధానోపాధ్యాయిని కొనియాడారు. ఈ సందర్భంగా వారిని ప్రత్యేకంగా సన్మానించారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాపూజీ రెడ్డి, ఆదంబీ నాగరాజు, హేమలత, వెంకటేష్, దత్ తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**రేపల్లె, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల చెప్పారు. శనివారం పోలీసులు, న్యాయవాదులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మార్చి 14వ తేదీ జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. ఈ అదాలత్‌లో పరిష్కారం పొందే కేసుల గురించి వివరించారు. కక్షిదారులలో అవగాహన కల్పించి న్యాయం పొందే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆమె సూచించారు. అదాలత్‌లో పరస్పరం కక్షిదారులు ప్రయోజనం పొందే విధంగా కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని ఆమె చెప్పారు. రేపల్లె పట్టణ, రూరల్ సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పరిధిలోని కేసుల పూర్వాపరాలను సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సాయిగీతావాణి, రేపల్లె బార్ అసోసియేషన్ కార్యదర్శి యు.శ్రీనివాసరావు, రేపల్లె రూరల్ సిఐ సురేష్‌బాబు, రేపల్లె టౌన్ ఎస్ఐ రాజశేఖర్, ఎక్సైజ్ ఎస్ఐ రాజశ్రీ, న్యాయవాదులు, ఎక్సైజ్, పోలీస్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## హెడ్ కానిస్టేబుల్ ప్రతిభకు సత్కారం

**కొల్లిపర, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** కొల్లిపర పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ డి.నాంచారయ్య 2025 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం అందజేసే ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికైన సందర్భంలో శనివారం ఎస్ఐ ఎన్‌సి ప్రసాద్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎన్‌సి ప్రసాద్ మాట్లాడుతూ పోలీస్, అగ్నిమాపక, జైలు, హోంగార్డుల వంటి విధులలో అసాధారణమైన ప్రతిభ చూపే ఉద్యోగులకు భారత హోం మంత్రిత్వ శాఖ ఉత్కృష్ట సేవా పతకం ద్వారా ప్రతిష్టాత్మకమైన అవార్డు అందజేస్తుందని చెప్పారు. 15 సంవత్సరాల సేవలను గుర్తించి నిబద్ధత, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారం లభిసు ్తందని తెలిపారు. ఈ పతకాన్ని ప్రతి సంవత్సరం ఆగస్టు 15వ తేదీ లేదా గణతంత్ర దినోత్సవం సందర్భంగా అందజేస్తుంటారని ఎస్ఐ ఎన్‌సి ప్రసాద్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



